కవితా కౌముది

తపన

తోకల రాజేశం

మన చుట్టూతా
పచ్చని ప్రేమనదులే పారుతున్నట్టనిపిస్తుంది
మనుషులంతా
పూసిన సింగిడీలోని పక్క పక్కనే ఉన్న రంగుల్లా
మెరుస్తారు
పలకరింపులన్నీ
గ్రీన్ టీలో పిండుకున్న నిమ్మరసమంత తొణుగా
పరిమళిస్తాయి
దగ్గరివాళ్ళు
ఒకే చెట్టుమీది పండును చెరోపక్క తినే
చిలుకల్లా మురిపిస్తారు

ఎలా జరుగుతోంది అర్థం కాదు కానీ
అకస్మాత్తుగా
మధ్యలో అగాధమొకటి కండ్లు తెరుస్తుంది
అంతే....
అప్పటిదాకా గలగలా పరుగెత్తిన
నదులెండి
నెర్రెలు వికటాట్టహాసం చేస్తాయి

కళ్ళముందు నుంచి మెల్లగా
ఇంద్రధనుస్సు జారుకుంటుంది
తియ్యటి గొంతులోకి
కటిక విషమేదో జారుతున్న యాతన
మదిలో లోతుగా వేళ్ళుతన్నిన మానవతా వృక్షం
విలగిపడుతున్న వికృత శబ్దం

అంతా తలకిందులవుతుంది

మెదడును కరకరా నమిలే ఒంటరితనం
శరీరం మీద పాములా పాకుతుంది
లోలోపల ఏదో పగులుతున్నట్టనిపిస్తుంది
పరిసరాలన్నీ పరాయి వాసన కొడుతాయి

కళ్లకేమో నిరంతర తుఫాను లాంటి వర్షం
చెక్కిళ్ళు ఎదురు చూస్తాయి
ప్రేమగా తుడిచే చేతుల కోసం..!!

★★★



శుభోదయం
కృష్ణరవళి

వేళ్ళసందున ఇసుక లా జారేకాలం ..
దిగులు వంతకే మలాము జ్ఞాపకం
చీకటి వెలుగు చిరుజల్లుల లో పయనం
మనసు వెతికే మచ్చిక కోసం ఆరాటం.
ఆగవు ఉదయాలూ సంధ్య పొద్దులూ
నిత్య నివేదనీ జనన ప్రస్థానాలూ
దవ్వున సాగిన మోహన మురళీ నాదం
అదిగదిగో తూరుపు రేఖ అద్దుకున్న సిందూరం.
వేయిదీపాల వెలుగున మెరిసే ఆనందరూపం
మళ్ళీ వచ్చిన వసంతం..తాకే మలయసమీరం
ఉప్పొంగి ఉరికిన సస్య సౌందర్య ప్రవాహం .
మరలా మొదలయ్యే మాయా మోహపు తారంగం
తప్పదు తప్పదు ఈ.జీవనయానం
అందుకే మరో శుభోదయం మిత్రమా ..!!

★★★



నా గది
కళ్యే వేంకటేశ్వర శాస్త్రి

నా గది...
దానికి అన్నీ తెలుసు -
సంతోషంతో మత్తెక్కిన రాత్రుల్లో
నేను ఒంటరిగా డాన్స్ చేసిన అడుగులు
నా నవ్వుల ప్రతిధ్వనులు
అన్నీ దాని గోడల మధ్యే మిగిలిపోయాయి...!
ఎవరికీ చెప్పలేని నా మాటలు
నా మనసుకే తెలిసిన రహస్యాలు
నిశ్శబ్దంగా దానికే చెప్పుకున్నాను
అది ఒక్క మాట కూడా బయట పెట్టలేదు...!
మనసు ముక్కలైన వేళ
కన్నీళ్లు ఆగకుండా జారిన రాత్రులు
గుండె నొప్పితో నేలపై కూర్చుని
నిశ్శబ్దంగా కూలిపోయిన క్షణాలు...
అన్నీ అది మాత్రమే చూసింది...!
ఒక్కోసారి నాకే ఆశ్చర్యం వేస్తుంది
అంత చిన్న గది...
ఇంత పెద్ద ప్రపంచాన్ని ఎలా దాచుకుంది అని...!
బయట ప్రపంచం ఎంత మారినా
నన్ను అర్థం చేసుకునేది
ఆ గదే అనిపిస్తుంది...!
అందుకే కావచ్చు
అది కేవలం గది కాదు
నా హృదయం దాచుకున్న ఆశ్రయం!!
ఎంత ఆలస్యమైనా
ఎంత దూరం వెళ్లినా
చివరికి చేరాలని అనిపించే
ఒకే ఒక చోటు... నా గది...

***

రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

వ్రాసిరెవరు నా జీవితగ్రంథమిట్లు?
రెప్పపాటులో గీసిరీ రేఖలెల్ల
తిన్నగా సాగిపోవును కొన్ని గతులు
వక్రమార్గములో కొన్ని బాటలరుగు

ఏ యనూహ్యశక్తియె లిఖియించెనేమె
స్వలిఖితమ్మైన నాదు కావ్యమ్ము కాదు
ఎవ్వరో నిర్ణయించినదీ పథమ్ము
శాశ్వతముగ చెక్కిన శిలాశాసనమ్ము

చేయగలిగినదెంత నా జీవితమున
స్వప్రయత్నము లేక సర్వమ్ము గడచు
అంబరము తాకునద్భుతాహ్లాదమైన
నాశమెరుగని దుర్భరక్లేశమైన

నాదు మనుగడకేనె యెట్లౌదు కర్త?
అన్నియు నడచు నా ప్రమేయమ్ము లేక
తలతు నేనె సారథినీ రథమునకంచు
తలపులనుగూడ నడిపించు నలువ యెవరో!

కష్టము సుఖమ్ము జ్ఞానమజ్ఞానమైన
రోగమైనను శుద్ధవైరోగ్యమైన
ఏది యెట్టుల ప్రాప్తించునెవ్వడెరుగు?
ఆన్ని స్థితులు సిద్ధించు తమంత తామె

COMMENTS